సాక్షి పల్నాడు

శనివారం ౹ 3 ౹ ఆగస్టు ౹ 2024



ముగిసిన పారాయణం

అమరావతి: అమరావతి యోగాశ్రమంలో ఆషాఢ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన అహోరాత్ర విష్ణు సహస్రనామ పారాయణం గురువారం రాత్రి ముగిసింది.



గ్రామదేవతలకు సారె సమర్పణ

కొల్లూరు : కొల్లూరులో పార్వతి అమ్మవారు, గంగానమ్మ దేవతలకు సారెలు సమర్పించి పూజలు నిర్వమించారు. అనంతరం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవాని నగర్‌లో కనకదుర్గ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

సాగర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



విజయపురిసౌత్: పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ శుక్రవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం సాగర్‌లో నూతనంగా 1800 ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన నేపథ్యంలో కలెక్టర్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. కలెక్టర్ సాగర్‌లోని ఫ్లైటెక్ ఏవియేషన్‌కు చేరుకొని ఆ సంస్థ ఎండీ కెప్టెన్ మమతతో చర్చించారు. అనంతరం విమానాశ్రయం ఏర్పాటుకు కావాల్సిన భూములను సెస్నా హెయిర్‌క్రాఫ్ట్‌లో వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ వెంట గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, మాచర్ల ఎంపీడీఓ సరోజిని, డీటీఓ శ్రీనివాసరావు, కెప్టెన్ నాని, విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభి రామయ్య తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల కొరత నిజమే..

డీవీఈవో పద్మ వివరణ

గుంటూరుఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బ్యాగులు పంపిణీలో జాప్యంపై 'సాక్షి'లో ఈనెల 1న 'పుస్తకం-ఆలస్యం-శాపం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా వృత్తి విద్యాధికారి (డీవీఈవో) జె.పద్మ స్పందించారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఆయా సామగ్రిని పూర్తిస్థాయిలో పంపిణీ చేశామని వివరిస్తూనే ఇంకా 2,018 మంది విద్యార్థులకు 1,992 పాఠ్య పుస్తకాలు, 2352 నోట్సులు, 317 బ్యాగులు రావాల్సి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రాగానే వాటిని విద్యార్థులకు పంపిణీ చేస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

12న అండర్-23 అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో అండర్-23 యువతీ, యువకుల అథ్లెటిక్ జిల్లా జట్టు ఎంపికను ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్ని ఆరోజు ఉదయం 10 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొత్తం 20 ఈవెంట్లలో నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన జట్టును ఈ నెల 18న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో శుక్రవారం మాసశివ రాత్రి సందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు.ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు భద్రాద్రి రాముల వారి సారె



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం భద్రాచలం రాములవారి దేవస్థానం నుంచి ఆషాఢ సారె అందింది. అమ్మవారికి సారె సమర్పించేందుకు భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి దేవస్థాన ఈవో ఎల్.రమాదేవి ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు , అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పట్టు చీర, పూజా సామగ్రిని, పసుపు, కుంకుమను అర్చకులకు అందజేశారు. భద్రాచలం ఈవో రమాదేవికి అర్చకులు వేద ఆశీర్వచనం అందజేయగా, ఈవో కేఎస్ రామరావు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలను బహూకరించారు.

మిర్చి సాగు తగ్గింది

- పంట వేసేందుకు భయపడుతున్న రైతులు
- వరుస నష్టాలతో వెనకడుగు
- సాగునీటి విడుదలపై అనుమానం
- పెరిగిన పెట్టుబడులు..తగ్గిన దిగుబడులు
- బొబ్బరతో రైతులు బెంబేలు
- ప్రత్యామ్నాయ పంటవైపు రైతుల చూపు
- గత ఏడాది కన్నా 20 వేల హెక్టార్లలో తగ్గిన మిర్చి సాగు



పెదకూరపాడులో ప్రత్యామ్నాయంగా సాగుచేసిన బీర

పెదకూరపాడు: సాగు దశలో నకిలీల బెడద..పూత, పిందె దశలో చీడపీడల బెడద ఓ వైపు...సాగునీటి కొరత మరోవైపు...ఆ తర్వాత బొబ్బర తెగులు వ్యాప్తి...ప్రకృతి వైపరీత్యాలు...వీటన్నింటిని తట్టుకుని సాగు చేస్తే దిగుబడి దశలో గిట్టుబాటు ధర ఉండదు...ఫలితంగా మిర్చి సాగు చేసిన రైతుకు గుండె కోత తప్పడం లేదు. దీంతో మిర్చి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఫలితంగా ఈ ఏడాది పల్నాడు జిల్లాలో మిర్చి సాగు తగ్గింది. ప్రత్యామ్నాయ పంటవైపు చూస్తున్నారు.

రెండేళ్లగా తగ్గుతున్న సాగు

పల్నాడు జిల్లాలో మిర్చి సాగు రెండేళ్లలో గణనీయంగా తగ్గింది. పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల, చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లో మిర్చి సాగును అధికంగా సాగు చేసేవారు. జిల్లా వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో 58,524 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. 2023-24 సంవత్సరంలో 51,962 హెక్టార్లలో సాగు చేశారు. రెండు సంవత్సరాల్లో 6,562 హె క్టార్లలో మిర్చి సాగు తగ్గింది. వర్షభావ పరిస్థితులు, సాగునీటి కొరత, చీడపీడల దాడులకు ఈ ఏడాది 40వేల హెక్టార్లలో సాగు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే రెండేళ్లలో 20 వేల హెక్టార్లలో సాగు గణనీయంగా తగ్గింది.

సంవత్సరం	సాగు విస్తీర్ణం
2022-23	58,524(హెక్టార్లు)
2023-24	51,962 "
2024-25	40,000 " (అంచనా)

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

మిర్చి సాగు చేసి నష్టాల్లో మునిగిపోవడం ఇష్టం లేని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు చూస్తున్నారు. ఉద్యాన పంటల్లోనే టమాటా, వంకాయలు, పుచ్చ, బీరలు, శనగలు, అపరాలు వంటి సాగును రైతులు చేస్తున్నారు.

బొబ్బర బెడద..సాగునీటి కొరత

ధైర్యం చేసి సాగు చేసినా బొబ్బర తెగులు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. వాటిని నివారించేందుకు రైతులు అనేక రకాల రసాయన, పురుగుమందులు అధిక ధరకు కొనుగోలు చేసి పిచికారి చేసినా ఫలితం ఉండడం లేదు. చివరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు నాగార్జున సాగర్ నుంచి సాగునీరు వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఆరుతడికి నీరు లేకపోతే పూత, పిందె రాలి తీవ్ర నష్టాలు పాలవుతారు.

నకిలీల భయం

పల్నాడు జిల్లా వ్యాప్తంగా మిర్చి రైతులను నకిలీ విత్తనాల భయం పట్టుకుంది. సీజన్ సమయంలో వందలాది రకాలు మిర్చి విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో అనేక నకిలీ విత్తనాలు వెలుగుచూస్తున్నారు. రెండేళ్లలో పెదకూరపాడు, మేడికొండూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల వంటి ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు వెలుగు చూశాయి. పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలో సుమారు 200 ఎకరాలలో నకిలీ విత్తనాలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. దాదాపుగా రూ.2 కోట్లు నష్టపోయారు. చివరకు కొన్ని కంపెనీలు రైతులకు పరిహారం చెల్లించాయి. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్న అధికారులు వాటిని అరికట్టడంలో మాత్రం ఎలాంటి ఆసక్తిచూపడం లేదు.



నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న పంటను తొలగిస్తున్న రైతులు(ఫైల్)

గతేడాది ఐదెకరాల్లో సాగు చేశా...



గతేడాది పెదకూరపాడులో ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాను. వాటిలో రెండెకరాలు బొబ్బర తెగులుతో పీకేశాను. మిగిలిన మూడెకరాల్లో సాగునీరు లేక పంట దిగుబడి తగ్గింది. ఎకరాకు రూ.30 వేల వరకు నష్టం వచ్చింది. మిర్చి సాగు చేయాలంటే భయంగా ఉంది. అందుకే ఈ ఏడాది సాగు చేయడం లేదు.

–చందా మహేష్, కౌలు రైతు,పెదకూరపాడు

చేతి వృత్తులు చేసుకుంటున్నా...



మిర్చి పంట ఆశించిన స్థాయిలో రాబడి ఉండటం లేదు. దీంతో గతేడాది బొప్పాయి, కూరగాయలు సాగు చేశాను. వాటిలో కూడా ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదు. దీంతో వ్యవసాయం మాని వేశాను. చేతివృత్తులు చేసుకుంటున్నాను.

–గంటా గోపి, 75త్యాళ్లూరు

గణనీయంగా తగ్గింది.



గత రెండేళ్లలో మిర్చి సాగు గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది బాగా తగ్గింది. సాగునీటి కొరత, పలు కారణాలు ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆకుకూరలు, ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మిర్చి సాగు తగ్గింది.

–శ్రీనిత్య, ఉద్యానశాఖాధికారి, పెదకూరపాడు

సేంద్రియ సాగు విస్తృత స్థాయిలో చేపట్టాలి

డీపీఎం అమలకుమారి



నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, ఈవిధానంలో పంటల సాగును విస్తృత స్థాయిలో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. అంజిరెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 28 మండలాల్లో 52,319 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. 30 రకాల విత్తనాలతో పచ్చిరొట్ట సాగును 37,940మంది రైతులు 41,824 ఎకరాల్లో సాగు ప్రారంభించారని తెలిపారు. ఈ విధానం వలన భూమిలో కర్బన శాతం పెరిగి, భూమిలో నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రధాన పంటకు చీడపీడల నుంచి ఉధృతి తగ్గుతుందని వివరించారు. ఈ సంవత్సరం జిల్లాలో 508 కాంటాక్ట్ బ్లాకుల్లో 1326 ఏటీఎం మోడల్స్, 26,604 కిచెన్ గార్డెన్స్ వేయాలని లక్ష్యంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటలు వేయడం ద్వారా ప్రధాన పంటలకు తెగుళ్లు, పురుగుల బెడద తగ్గుతుందని సూచించారు. రైతులకు ప్రధాన పంటకు అయ్యే ఖర్చు తగ్గడమే కాకుండా, భూమి సారవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 6,034 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 260, బ్యాంక్ కెనాల్‌కు 1539, తూర్పు కెనాల్‌కు 606, పశ్చిమ కెనాల్‌కు 189, నిజాంపట్నం కాలువకు 410, కొమ్మమూరు కాలువకు2680 క్యూసెక్కులు విడుదల చేశారు.

చిరు జీవితాలతో టీడీపీ చెలగాటం

- నరసరావుపేట మున్సిపాలిటీలో 50 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు
- టీడీపీ నాయకుల ఆదేశాలతో విధులకు రావొద్దని చెప్పిన కమిషనరు
- స్థానిక ఎమ్మెల్యేని కలిసినా ఫలితం శూన్యం
- గత ప్రభుత్వంలో చేరారంటూ ఆరోపణ
- ఏడాదికి 20లక్షలు ఉద్యోగాలు ఇవ్వటమంటే ఇదేనా అంటూ చిరుద్యోగులు ప్రశ్న

నరసరావుపేట: చిరు జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను టీడీపీ నాయకులు అన్యాయంగా పీకేశారు. నాయకుల మాటలతో గత నెల ముగింపు నుంచి మీరిక ఉద్యోగాలకు రానవసరం లేదని మున్సిపల్ అధికారులు చెప్పటంతో వారు తల్లడిల్లుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదికి 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న నాయకులు అధికారంలోకి రాగానే తమ వారిని, తమ పార్టీ వారికి అవకాశం కల్పించి తద్వారా ఆర్థిక లాభం పొందాలనే ఉద్దేశంతోనే ఈ పని చేశారనే ప్రచారం జరుగుతుంది. వివరాలను పరిశీలిస్తే...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించింది. దీని ద్వారా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సుమారు 1.40లక్షల మంది జనాభా నివాసం ఉండే పురపాలక సంఘంలో 54 మందికి ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించింది. వీరు ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, ఆఫీసు విభాగాలలో పనిచేస్తున్నారు. వీరిలో బీటెక్ పూర్తి చేసిన వారు సైతం ఉన్నారు. డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి చదువులు చదివారు. టెక్నికల్ విభాగంలో పనిచేసే కొంతమంది నెలకు రూ.21,500, నాన్ టెక్నికల్, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసే మరికొంత మంది రూ.19,500 వేలు, ఫిజికల్ వర్కర్లుగా పనిచేసే మరికొందరు రూ.15వేలు, రూ.13వేలు జీతాలు పొందుతున్నారు. వీరిలో నలుగురు మినహా 50 మందిని గత నెల 30వ తేదీన పిలిచి మీరు ఒకటో తేదీ నుంచి విధులకు రానవసరం లేదని, ఏదైనా ఉంటే స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడుకోవాలని మున్సిపల్ కమిషనరు చెప్పినట్లు ఉద్యోగులు తెలియచేస్తున్నారు. వీరు ఈ విషయం స్థానిక సీఐటీయూ నాయకులకు తెలియచేయటంతో వారు ఉద్యోగులతో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యేను కలిశారు. మీరు వీరిని నియమించలేదు, స్థానిక మాజీ ఎమ్మెల్యే ద్వారా వీరు ఉద్యోగాల్లో చేరారు. సీఐటీయూ నాయకులతో ఎమ్మెల్యే మీకు ఈ విషయం అనవసరం అన్నట్లు ఉద్యోగులు తెలియచేస్తున్నారు. కేవలం గత ప్రభుత్వంలో ఉద్యోగాల్లో చేరారనే ఉద్దేశంతో వీరిని ఉద్యోగాల నుంచి తొలగించటం దారుణమనే వాదన విన్పిస్తుంది. కాగా, వీరి స్థానంలో తమ వారిని నియమించుకునేందుకు అభ్యర్థులను ఎంపిక చేశారని, దీనికి ఒక్కొక్కరి నుంచి లక్షల సొమ్ము వసూలు చేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.

విధులకు రావొద్దని చెప్పలేదు

తామెవరిని ఉద్యోగాలకు రావొద్దని చెప్పలేదు. కొందరు పనిచేయకుండానే ఉద్యోగులుగా చెలామణీ అవుతున్నారు. అటువంటి వారిని నియంత్రించాం.

– సి.రవిచంద్రారెడ్డి, కమిషనర్

గొడవల జోలికి వెళ్లొద్దు



పిన్నెల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

- పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు
- మాచవరం, దాచేపల్లి మండలాల్లో పర్యటన

మాచవరం: ప్రజలు ఎవరూ గొడవల జోలికి వెళ్లవద్దని, వాటి వలన కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాచవరం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని పిన్నెల్లి గ్రామాన్ని సందర్శించారు. స్థానిక శివాలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అనేక కుటుంబాలు ఊరి విడిచి వెళ్లడంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పరిస్థితులు, జీవన విధానాలు, పండుగలు, యువత, విద్య, వ్యవసాయం పలు అంశాలపై గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొడవలు వలన ఎన్నో అనర్థాలు కలుగుతాయని, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో శాంతియుతంగా జీవించాలని తెలిపారు. గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ సురేష్‌బాబు, సీఐ సురేందర్‌బాబు, ఇన్‌చార్జి ఎస్‌ఐ శివనాగరాజు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

దాచేపల్లి: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. దాచేపల్లి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ని శుక్రవారం తనిఖీ చేశారు. సీఐ ఎ.సురేంద్రబాబు ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలు సీఐ సురేంద్రబాబు వివరించగా సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కి ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించాలని, ఫిర్యాదులు స్వీకరించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు అండగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సివిల్ కేసుల జోలికి వెళ్లవద్దని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జీ సంధ్యారాణి ఉన్నారు.

ఆరుగురు విద్యార్థులు.. ఇద్దరు ఉపాధ్యాయులు

- జాష్టివారిపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన డీపీవో
- ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపాలని రిపోర్టు
- అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ
- ముగ్గురు చిన్నారులే ఉండటంతో మరో కేంద్రంలో విలీనానికి ఆదేశం



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం నాణ్యత పరిశీలిస్తున్న డీపీవో విజయభాస్కర్‌రెడ్డి

నాదెండ్ల: నాదెండ్ల శివారు జాష్టివారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం విజయభాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, సీడీపీవో శాంతకుమారి, ఎంఈవో కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు ఉన్నారు. ఆయా తనిఖీల్లో పలు లోపాలు గుర్తించారు. ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు గాను ఇరువురు ఉపాధ్యాయులు ఉండటం, అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు పిల్లలకుగాను అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా ఉన్నారు. ఆరుగురు విద్యార్థులకు ఇరువురు ఉపాధ్యాయులు అవసరమా అంటూ ప్రశ్నించారు. ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు బదిలీ చేసేలా జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సమీపంలోని మరో అంగన్‌వాడీ కేంద్రంలో విలీనం చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులకు వడ్డించే పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. వంటగదిలో చిన్నారులకు అందించేందుకు కోడిగుడ్లు లేకపోవటంతో అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. ఈనెలకు సంబంధించిన కోడిగుడ్లు ఇంకా ఇవ్వలేదని ఆమె బదులిచ్చింది. గురు, శుక్రవారాల్లో వేరేచోట్ల బదులు తీసుకొచ్చి చిన్నారులకు అందించామని సమాధానమిచ్చారు. చిన్నారులకు ప్రతి నెలా ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా సూచనలు చేస్తూ ఒక్కో విద్యార్థిని తూకం వేశారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవో శాంతకుమారిని ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన ఆదేశించారు. ఆమె స్పందిస్తూ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామని, మరీ తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేస్తామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం, కోడిగుడ్లు అందిస్తామన్నారు. వారితో పాటూ సూపర్‌వైజర్ నిర్మలాకృష్ణమాల ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

- గడ్డిమందు తాగి చికిత్స పొందుతున్న భార్య
- రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న భర్త

నాదెండ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భార్య గడ్డిమందు తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, భర్త రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు తెలిపిన వివరాలు.. కనపర్రు గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల లూర్దురాజు (28)కు సాతులూరు గ్రామానికి చెందిన అంజనాతో మూడేళ్ల కిందట వివాహమైంది. కూలి పనులు చేసుకుని దంపతులు జీవనం సాగిస్తుంటారు. ఇరువురి మధ్య కొన్నిరోజులుగా మనస్పర్థలు నెలకొన్నాయి. దీంతో భార్య అంజనా గడ్డిమందు తాగటంతో కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. భర్త లూర్దురాజు సాతులూరు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాతులూరు స్టేషన్‌మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

జెడ్పీ స్థాయీ సంఘాల్లో సభ్యుల ఎన్నికే ప్రధాన అజెండా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం జరగనుంది. 2019లో ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేల పదవీ కాలం ముగియడంతో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను జెడ్పీ స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఈవో ఎన్వీవీఎస్ వసంతరాయుడు శుక్రవారం తెలిపారు. జెడ్పీలోని ఏడు స్టాండింగ్ కమిటీల్లో పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను సభ్యులుగా ఎన్నుకుని, ఆయా ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కమిటీలో 12 మంది సభ్యులు ఉండాల్సిన దృష్ట్యా, పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో 1,2,4,7వ కమిటీల్లో వరుసగా ముగ్గురేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందని తెలిపారు. 3, 5, 6వ స్థాయీ సంఘాల్లో ఇద్దరేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందని వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను సమావేశానికి ఆహ్వానించారు.

క్లుప్తంగా

నేడు ఐఐటీ బృందాల రాక

తాడికొండ: రాజధానిలో నిర్మాణాల్ని పరిశీలించేందుకు శనివారం ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందంతో పాటు చెన్నై బృందం కూడా రానుంది. తుళ్లూరు– నేలపాడు మధ్య అసంపూర్తిగా ఉన్న శాశ్వత హైకోర్టు, సచివాలయం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తుంది. ఈ నేపథ్యంలో నీటిలో ఉన్న నిర్మాణాల్ని శుక్రవారం ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ముందస్తుగా పరిశీలించింది. ఆ ప్రాంతంలో ట్రయల్ రన్ నిర్వహించింది. నీటి లోపలికి వెళ్లి పరిశీలన చేసింది.

రేపు ఆషాఢ మాస అమావాస్య రాహుకేతు పూజలు



పెదకాకాని: ఆషాఢ మాస అమావాస్య ఆదివారం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో రాహుకేతు పూజలకు ఉప కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని రాహుకేతు పూజ మండపం వద్ద ప్రత్యేక టెంట్లు, క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి పూజ టికెట్లు ఆలయ ప్రధాన కౌంటరులో అందుబాటులో ఉంటాయని, ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా పొందవచ్చని ఉప కమిషనర్ తెలిపారు.

యార్డులో 34,174 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,367 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,174 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకానికి రూ. 10,000 నుంచి రూ. 16,600 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,098 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5000, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

జగన్‌ని చూసి నేర్చుకో చంద్రబాబు !

- సూపర్‌సిక్స్ అంటేనే భయం అంటున్న చంద్రబాబు
- ఇచ్చిన మాటపై నిలబడే నిబద్ధత ఉండాలి
- ఎన్నికల హామీలపై ప్రభుత్వం అప్పుడే యూటర్న్
- శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లేళ్ల అప్పిరెడ్డి, పక్కన శివకుమార్

తెనాలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలపై యూటర్న్ తీసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ హామీల్ని ఇచ్చి, ఇప్పుడు వాటిని తలచుకుంటేనే భయమేస్తుందని చెప్పడం యూటర్న్ కాక మరేమిటని ప్రశ్నించారు. శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎంపికయ్యాక తొలిసారిగా తెనాలి వచ్చిన లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబునాయుడు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కారని, మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసి, రాష్ట్ర పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగిన నేతగా గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారంలో రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు అప్పు ఉందని చెప్పారని, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్లు అప్పులున్నట్టు ప్రకటన చేయించారని చెబుతూ వాస్తవానికి రాష్ట్ర అప్పులు రూ.7 లక్షల కోట్లు మాత్రమేనని అన్నారు. రాజకీయ నేతకు నిబద్ధత ఉండాలని, ఇచ్చిన మాటపై నిలబడి ఉండాలని తెలిపారు. ఆ విషయంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ సంక్షేమ క్యాలెండరును ప్రకటించిన మరీ నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. సూపర్‌సిక్స్ హామీలపై ప్రజలు ఆశగా చూస్తున్నారని, తల్లికి వందనం ఈ ఏడాది లేనట్టేనని, ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ కూడా లేదని అనుకుంటున్నారని తెలిపారు. ఏ పథకం ఉంటుందీ? ఏ పథకం లేదనే అయోమయ పరిస్థితులు కనిపిస్తున్నాయని అప్పిరెడ్డి అన్నారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగినపుడు, వారి హక్కుల్ని హరించివేస్తున్నప్పుడు వైఎస్సార్ సీపీ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని పేదల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కులమతాలు, రాజకీయ పార్టీలను చూడలేదని, ఓటు వేశారా? లేదా? అనేది కూడా చూడకుండా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేసినట్టు అప్పిరెడ్డి గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ఓట్లు వేయలేదనే సాకుతో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో రాష్ట్రాన్ని ఏవిధంగా తీసుకెళుతున్నారో ఆలోచించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూనే పేదలపక్షాన ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతుందని స్పష్టంచేశారు.

భారతి సిమెంట్‌తో భవన నిర్మాణాలు పటిష్టం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లారెడ్డి, పక్కన కొండలరెడ్డి తదితరులు

నెహ్రూనగర్: భారతి సిమెంట్‌తో భవన నిర్మాణాలు పటిష్టంగా ఉంటాయని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్)ఎం.సి. మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి వద్ద గల హాయ్‌ల్యాండ్‌లో శుక్రవారం గుంటూరు, కృష్ణా జిల్లాల భారతి సిమెంట్స్ డీలర్లతో వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ రంగానికి సంబంధించి నాణ్యతలో మేటిగానే కాకుండా నమ్మకంలో భారతి సిమెంట్ భరోసాగా నిలుస్తోందన్నారు. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల అభిమానాన్ని చూరగొంటూ విశేష ఆదరణ పొందుతుందని చెప్పారు. అధునాతన జర్మన్ టెక్నాలజీతో సుపీరియర్ క్వాలిటీ సిమెంట్‌ను వినియోగదారులకు అందజేస్తున్నామని తెలిపారు. సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) టి.కొండలరెడ్డి మాట్లాడుతూ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఆవశ్యకతను డీలర్లకు వివరించారు. భవన నిర్మాణంలో ఈ సిమెంట్ విశేష ఆదరణ చూరగొంటున్నట్లు తెలిపారు. అనంతరం అర్హులైన డీలర్లకు గోల్డ్ కూపన్స్ అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ బ్రాంచ్ హెడ్ డీజీఎం (మార్కెటింగ్) కె. మల్లికార్జునరెడ్డి, డీజీఎం టెక్నికల్ హెడ్ సి. ఓబుల్‌రెడ్డి, ఏఎస్ఎం(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ ఆఫీసర్ జయరాంరెడ్డి, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీ శంకర్, కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

వెస్ట్ గోదావరిపై గుంటూరు జట్టు ఘన విజయం



గుంటూరు బౌలర్ మహీప్ కుమార్



గుంటూరు బౌలర్ దీపక్



గుంటూరు బ్యాటర్ వసంత్ వర్ధన్

మంగళగిరి: నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ సీనియల్ మెన్ మల్టీడే అంతర్ జిల్లాల పోటీల్లో గుంటూరు జట్టు ఘన విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన గుంటూరు జట్టు వెస్ట్ గోదావరి జట్టుపై 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన గుంటూరు జట్టు 278 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వెస్ట్ గోదావరి జట్టు, గుంటూరు జట్టు ధాటికి 64 పరుగులకే కుప్పకూలింది. గుంటూరు జట్టు బౌలర్లు మహీప్ కుమార్ 6 వికెట్లు, దీపక్ 4 వికెట్లుతో రాణించారు. గుంటూరు బ్యాట్స్‌మేన్ హర్షవర్థన్ 50 పరుగులతో అర్థ సెంచరీ సాధించాడు.

పాలసీ చెల్లింపులు, రుణాల దరఖాస్తులను పరిష్కరించాలి



జేడీ అశోక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ)లో పాలసీలు పూర్తయిన వారితో పాటు వివిధ అవసరాల కోసం రుణాలకు ఉపాధ్యాయులు దాఖలు చేసుకున్న దరఖాస్తుల్ని తక్షణమే పరిష్కరించి, చెల్లింపులు జరపాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ డిమాండ్ చేశారు. మంగళదాస్ నగర్ రోడ్డులోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో శుక్రవారం జేడీ డి. అశోక్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయనకు వినతి పత్రం సమర్పించిన యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ రికార్డులు లభ్యం కాని క్లెయిమ్‌లకు ఎంఈవో ఆథరైజేషన్‌తో పరిష్కరించాలని కోరారు. వయో పరిమితి దాటిన ఉపాధ్యాయులు ప్రీమియాన్ని పెంచుకునేందుకు సివిల్ సర్జన్ సర్టిఫికెట్‌కు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఏపీజీఎల్ఐ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు.

100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ



మువ్వన్నెల జెండాతో ప్రదర్శనలో విద్యార్థులు

నరసరావుపేట రూరల్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకల సందర్భంగా ఎంఏఎం కళాశాలల ఆధ్వర్యంలో శుక్రవారం 100 మీటర్ల జాతీయ జెండాతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. పీఎన్‌సీ కళాశాల నుంచి గడియారం స్తంభం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. జాతీయ జెండాలతో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఏఎం కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ సాధినేని రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పసుపు రంగేసి.. నిబంధనలకు పాతరేసి...



పసుపుమయంగా ఇరుకుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం



ముప్పాళ్ళ గ్రామ సచివాలయానికి పసుపు రంగు వేసిన దృశ్యం

- టీడీపీ నాయకుల అత్యుత్సాహం
- ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు రంగు

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న శిలాఫలకాలు ధ్వంసం చేయడంతోపాటు ప్రారంభోత్సవాల దిమ్మెల తొలగింపు దుశ్చర్యలు కొనసాగాయి. ఇప్పుడు ఏకంగా పంచాయతీ కార్యాలయాలకు పసుపు రంగులు వేసి ఎన్టీఆర్ భవన్ తరహాలో టీడీపీ సొంత భవనాలు అన్నట్లుగా మార్చేస్తున్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, ఇరుకుపాలెం గ్రామాల్లోని సచివాలయాలను పసుపు రంగుతో కప్పేశారు. ముప్పాళ్ళ, గోళ్ళపాడు గ్రామాల్లో పంచాయతీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను సైతం వదల్లేదు.

షూటింగ్‌బాల్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జిల్లా జట్లతో హెచ్‌ఎం సోమనాథ్, నరసింహారావు, కిరణ్‌కుమార్, పీఈటీలు

సత్తెనపల్లి: షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోక సోమనాథ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా బాలుర విభాగంలో 60 మంది, బాలికల విభాగంలో 40 మంది హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పా నరసింహారావు, కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు. బాలుర జట్టుకు టి.తిలక్, కె.నరేష్, ఎస్.భార్గవ్, జి.నాగ హనుమ, జి.వెంకటేష్, వైఎస్ లికిత్ రెడ్డి, జె.మధు, బి.గోపి చంద్, వి.ఫణీంద్ర, కె.యశ్వంత్, ఎం.సతీష్ , కె.తరుణ్ తేజ, స్టాండ్ బైలుగా ఎల్.అరవింద్, వి.యోగిలు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఎం.నందిని, ఎస్.మనుషా, పి.సుచిత్ర, టి.భార్గవి, పి.మేఘన, ఎస్.సింధూర, పి.సులోచనరాణి, వి.విజయలక్ష్మి, కె.శ్రీలక్ష్మి, సీహెచ్. ప్రియాంక, సీహెచ్. హారిక, కె.బింధుమాధవిలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీఈటీలు అనిల్‌దత్తా నాయక్, లాకు పిచ్చియ్య, ఎస్.ప్రసన్న, షేక్ ఆదంషఫీ, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

9 వికెట్ల తేడాతో తూర్పుగోదావరి విజయం


నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో తూర్పుగోదావరి జిల్లా జట్టు 9 వికెట్ల తేడాతో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. కర్నూలు జిల్లా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 145 పరుగులకు ఆలౌట్ అయింది. తూర్పుగోదావరి జట్టు 5 వికెట్ల నష్టానికి 176 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో శుక్రవారం ఆట ప్రారంభించింది. 217 పరుగులకు ఆలౌట్ అయింది. కర్నూలు బౌలర్ బి.మోహిత్ 8 వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 127 పరుగులకు ఆలౌట్ అయింది. తూర్పుగోదావరి బౌలర్ మోజెస్ 4 వికెట్లు సాధించాడు. 56 పరుగుల విజయ లక్ష్యాన్ని తూర్పుగోదావరి జట్టు ఒక వికెట్ నష్టపోయి ఛేదించింది. తూర్పుగోదావరి జట్టుకు 6 పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

తీర్పును చంద్రబాబు రాష్ట్రంలో అమలు చేయాలి

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల్ని మీనమేషాలు లెక్కించకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం మాదిగలు, మాదిగ ఉపకులాలు మూడు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఎంతో మంది మాదిగలు జైలుకెళ్లడంతో పాటు, కొన్ని కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని పేర్కొన్నారు. ఎందరో ఈ ఉద్యమంలో అసువులు బాసిన విషయాన్ని గుర్తు చేశారు. వీరందరి త్యాగాల వల్ల నేడు వర్గీకరణ సాధించుకోగాలిగామని చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మొట్టమొదటి నుంచి వర్గీకరణ అమలు చేస్తామని, ఉద్యోగాల్లో కూడా వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు.

భట్టిప్రోలులో వేడెక్కిన రాజకీయం



భట్టిప్రోలులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, భట్టిప్రోలుకు చెందిన తూనుగుంట్ల సాయిబాబా మధ్య నెలకొన్న మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది. దీంతో భట్టిప్రోలులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భట్టిప్రోలు మండలంలో పేకాట, కోడి పందేలు, అక్రమ ఇసుక వ్యాపారం నిర్వహిస్తూ దందాలు చేస్తున్నారని సాయిబాబాపై అశోక్‌బాబు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో తన అవినీతిని నిరూపిస్తే రథం సెంటర్ నడిబొడ్డున ఉరి వేసుకుంటానని సాయిబాబా ప్రకటించారు. దీని కోసం శనివారం బహిరంగ చర్చా వేదిక ఏర్పాటు చేస్తానని సవాలు చేశారు. స్పందించిన అశోక్‌బాబు, సాయిబాబా అవినీతిని నిరూపించేందుకు చర్చకు సిద్ధమేనని ప్రకటించారు. అశోక్‌బాబు శుక్రవారం భట్టిప్రోలు విచ్చేసి పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. వేమూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అయితే భట్టిప్రోలు మండలానికి సాయిబాబా ఎమ్మెల్యేలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. గతంలో కూడా సాయిబాబా పలు మార్లు ఉరి వేసుకుంటానని బహిరంగ చర్చకు రావాలని మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునను, ప్రస్తుతం తనను కూడా ఇదే విధంగా బెదిరిస్తున్నారని అన్నారు. భట్టిప్రోలు పంచాయతీకి ఢిల్లీ స్థాయిలో పేరు ఉందని..... అటువంటి గ్రామాభివృద్ధికి పాటు పడకుండా ఇలాంటి కుళ్లు, కుతంత్రాలు, కుయుక్తులు పన్ని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా భట్టిప్రోలులో నెలకొన్న ఆక్రమణలు, పక్కా డ్రెయినేజీ వ్యవస్థ వంటి సమస్యల పరిష్కారానికి సాయిబాబా శ్రద్ధ చూపితే బాగుంటుందని అశోక్‌బాబు హితవు పలికారు.

పౌర సరఫరాల్లో లోపాల్ని ఉపేక్షించం

జేసీ ఏ. భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: ప్రజలకు అందించే సరుకులతో పాటు ఇతర సేవల్లో లోటుపాట్లను ఉపేక్షించే ప్రసక్తే లేదని జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం సివిల్ సప్‌లైస్ అధికారులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, సేవా విభాగాల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. అందరి సూచనాలు, సలహాలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే నిత్యావసర సరుకుల తూకంలో తేడాలుండకూడదని తెలిపారు. కొన్ని వర్గాలు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారని, వాటిపై తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎల్‌పీజీ సిలిండర్లు నిర్దేశించిన తూకంతోనే వినియోగదారులకు చేరాలని సూచించారు. డెలివరీ సమయంలో కొందరు కొంత మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై గ్యాస్ కంపెనీ యజమానులు చర్యలు తీసుకోవాలని జేసీ చెప్పారు. ఇక నుంచి పౌరసరఫరాల విభాగంపై నిరంతరం సమీక్ష ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.

ఇసుక సక్రమంగా అందించాలి

తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



మున్నంగి స్టాక్ పాయింట్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మున్నంగి(కొల్లిపర): ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద అవతవకలు లేకుండా, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే అందించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారుల్ని ఆదేశించారు. అదనంగా వసూలు చేయరాదని స్పష్టం చేశారు. బయట వ్యక్తులు ప్రమేయం లేకుండా స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించాలని చెప్పారు. సీరియల్ ప్రకారం వచ్చిన వాహనదారులకు టోకెన్ అందించి ఇసుక లోడింగ్ చేయాలని సూచించారు. మండలంలోని మున్నంగి ఇసుక స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల వరుసగా సాక్షి, వివిధ మాధ్యమాలలో ఇసుక రీచ్ వద్ద అక్రమాలపై కథనాలు రావడంపై ఆయన అధికారులపై ఆగ్రహించారు. రీచ్ వద్ద తప్పులు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు, వే బిల్లులు, వాహనాలకు సీరియల్ నంబర్లు ఇచ్చే విధానాల్ని పరిశీలించారు. లారీ డ్రైవర్లతో మాట్లాడి అక్కడ విషయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు ఉన్నారు.

హామీ నిలబెట్టుకున్న ప్రధాని మోదీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

గుంటూరు మెడికల్: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఉద్యమం చేస్తున్న వారికి తీర్పు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీని ప్రధాని మోదీ నిలబెట్టుకున్నారని చెప్పారు.

ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.ఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంద కృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన మాదిగ విశ్వరూప సభలో అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణకు భారతీయ జనతా పార్టీ ఆమోదం తెలుపుతుందని ప్రధాని మోదీ ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం హామీని నెరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి తానుచింతల అనిల్ కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కో– ఆర్డినేటర్ దొడ్డ జార్జి, బీజేపీ జిల్లా కార్యదర్శి కత్తి మేరీ సరోజిని, మేకల లక్ష్మణ్, స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆవుల రామకోటేశ్వరరావు, పద్మనాభం, దుర్గాబాబు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.